క్లుప్తంగా

జగనన్న పోరుబాటకు తరలిరావాలి

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11న పొదిలి పొగాకు వేలం కేంద్రం పర్యటనను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఆ పార్టీ నాయకులు పలు గ్రామాల్లో ప్రచారం చేట్టారు. మండలంలోని కొనకనమిట్ల, చింతగుంట, తువ్వపాడు, వాగుమడుగు, గనివానిపాడు, మునగపాడు, వెలిగండ్ల గ్రామాల్లో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉడుముల గురవారెడ్డి పర్యటించారు. జగనన్న పోరుబాట కార్యక్రమానికి రైతులు తరలివచ్చి సంఘీభావం ప్రకటించాలని కోరారు.

అభయాంజనేయస్వామికి ఏకాంత సేవ


పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు అభయాంజనేయస్వామి ఆలయంలో 16 రోజుల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం 16 రోజుల వేడుక సందర్భంగా స్వామి వారికి ఏకాంత సేవ, పానుపు ఉత్సవం జరిపించారు. తొలుత భక్తి గీతాలతో ఏర్పాటు చేసిన భజనా కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమం అనంతరం గ్రామ మహిళలు, పురుషులు కలిసి ప్రదర్శించిన కోటాటం ఆద్యంతం ఆహూతులను అలరించింది.


జెడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణం


మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అర్ధంతరంగా ఆగిన తరగతి గదుల నిర్మాణం

నిధులకు కొర్రీ.. స్కూళ్ల అభివృద్ధికి ఉరి!

- ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులకు పైసా విదల్చని కూటమి ప్రభుత్వం
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మనబడి నాడు.. నేడు కింద రూ.58.76 కోట్ల ఖర్చు
- అర్ధంతరంగా ఆగిన పనులను కొనసాగించకుండా కూటమి సర్కారు మీనమేషాలు
- వారం రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నా అదే నిర్లక్ష్యం

మార్కాపురం టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పైసా విదల్చలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద చేపట్టిన పనులను కొనసాగించకుండా ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి చోద్యం చూస్తోంది. వారం రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ అరకొర వసతుల మధ్య పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకునే దుస్థితిని కూటమి ప్రభుత్వం కల్పిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత ప్రభుత్వంలో నాడు.. నేడు కార్యక్రమం కింద అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలనూ అభివృద్ధి చేశారు. మార్కాపురం నియోజకవర్గంలో ఫేజ్–1లో భాగంగా కొన్ని పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూములు, మరుగుదొడ్లు, నీటి సదుపాయం, విద్యుత్ తదితర సమస్యలపై దృష్టిసారించి అభివృద్ధి చేశారు. ఫేజ్–2లో భాగంగా మరికొన్ని పాఠశాలలను ఎంపిక చేసి కొంతమేర నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో ఎన్నికలు రావడం, కూటమి ప్రభుత్వం గద్దెనెక్కడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. స్కూళ్లలో నిలిచిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఏడాది అవుతున్నా నిధులివ్వకపోవడంతో అసంపూర్తి నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి.


తర్లుపాడు మండలం తుమ్మలచెరువు జెడ్పీ హైస్కూల్లో నిలిచిన తరగతి గదుల నిర్మాణం

మార్కాపురం నియోజకవర్గంలో 299 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 30,407 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నాడు–నేడులో ఫేజ్–1, 2 కింద 226 పాఠశాలలు ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో అభివృద్ధి కోసం రూ.58.76 కోట్లు ఖర్చు చేశారు. కొనకనమిట్ల మండలంలో 25 పాఠశాలల్లో నాడు నేడు భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మార్కాపురం పట్టణ, రూరల్‌లో 32 పాఠశాలల భవనాలు కూడా అర్ధంతరంగా ఆగిపోయాయి. పొదిలి మండలంలో 17 పాఠశాలల్లో నిధులు మంజూరు కాక పనులు నిలిచిపోయాయి. తర్లుపాడు మండలంలో 18 పాఠశాలల్లో భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు జెడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదులు, పొదిలి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల భవనాలు, కొనకనమిట్ల మండలంలోని పేరారెడ్డిపల్లి యూపీ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం నిధుల కొరత కారణంగా నిలవడంతో దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరంలోనైనా పాఠశాలల్లో భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించి, పనులు పూర్తి చేయాలని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

> **ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి**
>
> ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి మెరుగైన విద్యా బోధనకు ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న పేద, మధ్య తరగతి విద్యార్థులు ఆహ్లాదకర వాతావరణంలో చదువుకునేలా చూడాలి.
>
> – గాలి వెంకట్రామిరెడ్డి, రైతు సంఘ నాయకుడు

నేడు సచివాలయం ప్రారంభం

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయ భవనాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున మండల అధికారులతోపాటు ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లి దేవస్థానంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. పట్టణం నుంచేకాక పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

జగనన్న పర్యటనను విజయవంతం చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపు
- 11న పొదిలిలో పొగాకు రైతులకు వైఎస్ జగన్ పరామర్శ


పొదిలి సమావేశంలో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్/పొదిలి రూరల్: పొగాకు రైతుకు బాసటగా నిలిచేందుకు ఈనెల 11న పొదిలి రానున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, రైతన్నలు పెద్దఎత్తున తరలిరావాలని ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మార్కాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. అలాగే పొదిలి విశ్వనాథపురంలోని వివేకానంద జూనియర్ కాలేజీలో కార్యకర్తలతో అన్నా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు, కన్నీళ్లు తప్ప ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం కింద రైతన్నలకు ఇస్తానన్న 24 వేల రూపాయలు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పొగాకు రైతులకు అత్యధిక ధరలు లభించాయని ప్రస్తుత ప్రభుత్వంలో ఎందుకు ఇంత తక్కువకు పొగాకును కొనుగోలు చేస్తున్నారో చెప్పాలని నిలదీశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతన్నకు రైతు భరోసా అందించి మార్క్‌ఫెడ్ ద్వారా అత్యధిక ధర చెల్లించి పొగాకు రైతులకు అండగా నిలిచినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వంలో అన్ని ప్రశ్నించారు. లక్షలాది రూపాయల పెట్టుబడి పెట్టి పొగాకు వేలం కేంద్రాలలో రైతులు వేలానికి తీసుకువెళ్లిన పొగాకు బేళ్లను అమ్ముకో లేక తిరిగి వెనక్కి తీసుకెళ్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి అండగా నిలవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో చెప్పి ఓట్లు వేయించుకుని, తీరా అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోవడం ప్రజలను మోసగించడం కాదా అని ప్రశ్నించారు. తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన పొగాకు రైతుకు మద్దతుగా వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, పోరెడ్డి చెంచిరెడ్డి, బండి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు డాక్టర్ కనకదుర్గ, సిరాజ్, సలీమ్, బొగ్గరపు శేషయ్య తదితరులు పాల్గొన్నారు. పొదిలి సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, సాయి రాజేశ్వరరావు, కె.నరసింహారావు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అంకాలమ్మతల్లి జాతర


ఆలయం వద్దకు బారులు తీరిన కుంకుమ బండ్లు


వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

- భక్తులతో పోటెత్తిన కొనకనమిట్ల

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్లలో అంకాలమ్మతల్లి జాతర వైభవంగా సాగింది. శని, ఆదివారాల్లో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. కొనకనమిట్ల పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించారు తీర్చుకున్నారు. ఆదివారం భారీగా కుంకుమ బండ్లు కట్టి ఆలయం వరకు ఉత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు బోనాలతో వచ్చి నైవేద్యాలు సమర్పించారు. ముందుగా అమ్మవారి కలశ ఉత్సవం నిర్వహించిన భక్తులు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అంకాలమ్మతల్లి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పార్టీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 'అన్నా' ను పార్టీ నాయకులు సన్మానించారు. వైఎస్సార్ సీపీ, టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పొదిలి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కొనకనమిట్ల ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


పూజలందుకుంటున్న అంకాలమ్మతల్లి


చినమనగుండంలో నైవేద్యాలతో భక్తులు

పోలేరమ్మకు పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామ దేవత పోలేరమ్మ తల్లి, బొడ్డురాయికి అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సవం నిర్వహించారు. గ్రామంలో 40 రోజుల క్రితం నూతన పోలేరమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ నేపథ్యంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోలేరమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామం పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదు


బేస్తవారిపేటలో పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 11వ తేదీన పొదిలి వస్తున్నట్లు ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీపీ నివాసంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పొదిలి పొగాకు బోర్డులో రైతుల సాధకబాధలను వైఎస్ జగన్ తెలుసుకుంటారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించలేదన్నారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టాలు వచ్చాయని తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు, మొద్దు నిద్ర నుంచి కూటమి ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు వస్తున్న వైఎస్ జగన్‌కు రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు మద్దతు తెలిపి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు మల్లెల శేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు డి.జామీయా, నాయకులు పి.ఈశ్వరరెడ్డి, కొండా రఘునాథరెడ్డి, బొంతల లక్ష్మణస్వామిగుప్తా, గంజి ప్రసాద్, ఎల్‌బీసీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరించిన టీచర్లు


కొమరోలు ఎమ్మార్సీలో ఖాళీగా ఎంఈఓ వెంకటరత్నం, సిబ్బంది

కొమరోలు: మండలంలోని ఎంపీపీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఆదివారం మొదలైంది. రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరూ మాన్యువల్ రూపంలో ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఉన్నతాధికారులకు విన్నవించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వెబ్ కౌన్సెలింగ్ చేపట్టింది. దీంతో కొమరోలు మండలంలో బదిలీలకు అర్హత కలిగిన 47 మంది ఎస్జీటీలు యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. స్థానిక ఎమ్మార్సీకి ఒక్క ఉపాధ్యాయుడు కూడా హాజరు కాకపోవడంతో ఎంఈఓ వెంకటరత్నం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, కంప్యూటర్ డేటా ఆపరేటర్ రవీంద్రరెడ్డి ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది.

భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం


స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మోహిని అవతారంలో స్వామివారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారిని అర్చకులైన కందనూరి హరీషకుమార్, కందనూరి పార్థసారిథి, నంద్యాల శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో మోహినిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త మార్కాపురం సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


జువ్వలేరులో ప్రతిష్ఠించిన ధ్వజ స్తంభం

పొదిలిరూరల్: పొదిలి మండలం జువ్వలేరులో పట్టాభిరామస్వామి దేవస్థానంలో అభయ ఆంజనేయ స్వామి సహిత ధ్వజ ప్రతిష్ఠ, గమిడిదేవతల సహిత గ్రామ శీతల యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలు, శాంతి కల్యాణం చేశారు. జువ్వలేరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించారు.